

సర్కారు బెదిరింపులు..!

◆ అంగన్‌వాడీలకు నోటీసులు
◆ కేంద్రాలకు వెళ్లి నోటీసులు అతికిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది
◆ బెదిరింపులకు బెదిరేది లేదంటున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీలపై ప్రభుత్వం బెదిరింపుల పర్వం కొనసాగిస్తోంది. అన్ని విధాలుగా భయపెట్టి వారి సమ్మెను విచ్ఛన్నం చేసే కుట్రకు పూనుకుంటోంది. ఇప్పటికే అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించింది. దీనికి వారు భయపడకపోవడంతో తాజాగా నోటీసులు అందించే చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇందులో భాగంగా గత రెండు రోజులుగా ఆయా మండలాల్లో అంగన్‌వాడీలకు ఐసిడిఎస్ సిబ్బంది ద్వారా నోటీసులు అందించి బెదిరించాలని చూస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు దిగినా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదంటూ అంగన్‌వాడీలు తెగేసి చెబుతున్నారు.



ఓబుళదేవరచెరువులో అంగన్‌వాడీ కేంద్రానికి అధికారులు అతికించిన నోటీసు

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం నాడు 31వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ సమ్మె నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నిరసన శిబిరాల్లో కూర్చొని వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం ఐసిడిఎస్ అధికారుల ద్వారా అంగన్‌వాడీలపై బెదిరింపులకు దిగుతోంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేశారు. వీటిని తీసుకునేందుకు అంగన్‌వాడీలు నిరాకరించడంతో అంగన్‌వాడీ కేంద్రాల తలుపులు, గోడలపై నోటీసులను అతికించి వెళ్తున్నారు. మారుమూల గ్రామాలకు అయితే పోస్టల్ ద్వారా నోటీసులను పంపుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ బెదిరింపులపై అంగన్‌వాడీలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించి సమ్మెను పరిష్కరించాల్సింది పోయి ఇలా బెదిరింపులకు దిగడం ఏమిటంటూ నిలదీస్తున్నారు.

ఆది నుంచి బెదిరింపులే..

అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం ముందు నుంచే బెదిరింపులకు దిగుతోంది. సమ్మె ప్రారంభం కాగానే అధికారుల ద్వారా బెదిరించారు. దీనిని అంగన్‌వాడీలు ప్రతిఘటించారు. తరువాత సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేశారు. దీనిని కూడా అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. చివరకు ఈ నెల 8వ తేదీలోపు విధుల్లో చేరకుంటే ఎస్మాను ప్రయోగిస్తామని ప్రకటించారు. దీనికి కూడా బెదరకుండా అంగన్‌వాడీలు మొక్కవోని సంకల్పంతో సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా షోకాజ్ నోటీసులు ఇచ్చి ఒత్తిడి తెచ్చేలా కుట్రలు చస్తున్నారు. ప్రభుత్వం ఆదేశించిన మేరకు ఈ నెల 8వ తేదీలోపు విధుల్లోకి ఎందుకు చేరలేదంటూ షోకాజ్ నోటీసుల ద్వారా కోరుతున్నారు. నోటీసుకు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటమాని కూడా బెదిరిస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న బెదిరింపుల వైఖరిపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బెదిరింపులకు తలొగ్గేది లేదంటూ జిల్లా వ్యాప్తంగా సమ్మెను కొనసాగిస్తూ పోరాట పటిమను ప్రదర్శిస్తున్నారు.



మంత్రి పర్యటన అలా జరగాలి.. సమస్యలేమో ఇలా ఉన్నాయి... కార్యక్రమం ఎలా నిర్వహించాలి.. అంటూ చిలమత్తూరు మండల వైసిపి నాయకులు తలలు పట్టుకుంటున్నారు. వైసిపి రాయలసీమ జిల్లాల రీజనల్ కోఆర్డీనేటర్, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు చిలమత్తూరు మండలంలో పర్యటించనున్నారు. మంత్రి పర్యటనకు సంబంధించి మండల స్థాయి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో అభివద్ధి పనులు జరక్కపోవడంతో మంత్రికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామస్తుల నుంచి వ్యతిరేకత రాకుండా కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలన్న దానిపై స్థానికులు మల్లగుల్లాలు పడుతున్నారు.



పర్యటన అలా సమస్యలు ఇలా నిర్వహణ ఎలా?

ప్రజాశక్తి-చిలమత్తూరు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత నాలుగు రోజులుగా హిందూపురం నియోజకవర్గంలో విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఆయా మండలాల్లో గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడే అధికార పార్టీకి కొత్త తలనొప్పులు వస్తున్నాయి. వివిధ సమస్యలపై ఆయా గ్రామాల్లో మంత్రిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బుధవారం నాడు లేపాక్షి మండలంలో రోడ్ల సమస్యపై మంత్రిని అక్కడి ప్రజలు చుట్టుముట్టి నిరసన తెలిపారు. దీంతో ఒక్కసారిగా వైసిపి నాయకులు ఖంగుతున్నారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకున్న చిలమత్తూరు వైసిపి నాయకులు ముందస్తు చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. మంత్రి పర్యటించే గ్రామాల్లో ఎలాంటి ప్రశ్నలూ వేయొద్దని గ్రామస్తులను కోరుతున్నారు. గురువారం నాడు పలు గ్రామాల్లో వైసిపి గ్రామ, మండల నాయకులు ఈ రకంగా ఆయా గ్రామాల్లో ప్రజలను బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రశ్నించే వారు... నిలదీసే వారిని సభలకు తీసుకెళ్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

చిలమత్తూరు మండల పరిధిలోని దేమకేతేపల్లి పంచాయతీ తమ్మినాయనపల్లి, కోడూరు పంచాయతీలోని మధురేపల్లి, మొరసలపల్లి పంచాయతీలోని ఎస్.ముదిరెడ్డిపల్లి, చిలమత్తూరు పంచాయతీలోని చిన్నన్నపల్లి, శెట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మూడు గ్రామాలకు రోడ్డు సదుపాయం అధ్వానంగా ఉంది. రోడ్డు సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో దానిని పరిష్కరించకుండా ఏ పార్టీకి ఓట్లు వేయమంటూ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తమ్మినాయనపల్లి గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో అధికార పార్టీ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రోడ్డు వేస్తామని వారికి హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్నారు. ఎన్నికల ముగిసిన తరువాత హామీని గాలికి వదిలేశారు. ఈ సమస్యపై ఆ గ్రామస్తులు మంత్రిని ప్రశ్నించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం ఈ పంచాయతీలోనే మంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో అక్కడ ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందోనని వైసిపి నాయకుల్లోనే ఆందోళన కన్పిస్తోంది.

పేదలకు అందని ఇళ్ల స్థలాలు..

చిలమత్తూరు మండలంలో ఇళ్ల పట్టాల కోసం పేదలు నెలల తరబడి పోరాటాలు చేస్తున్నారు. ఇక్కడి పట్టాల పంపిణీ సమస్య రాష్ట్ర స్థాయిలో ప్రకంపనలు సృష్టించింది. సిపిఎం ఆధ్వర్యంలో పేదలు కోడూరు సర్వే నెంబర్ 805లో గుడిసెలు వేసుకుని భూస్వాధీన పోరాటం ప్రారంభించారు. ఇక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కొందరు అధికార పార్టీ నాయకులు పోలీసులు, రెవెన్యూ అధికారుల సాయంతో గుడిసెలను రాత్రికేరాత్రికే తొలగించారు. దీనిపై పేదలు ఆగ్రహించి భూ పోరాట ఉద్యమాన్ని తీవ్రతరం చేసి జిల్లా స్థాయిలో కొనసాగించారు. విజయవాడలో సైతం నిరసన తెలిపి అక్కడ ముఖ్య అధికారులకు వినతులు అందజేశారు.

◆ మంత్రి పర్యటనపై వైసిపి నేతల మల్లగుల్లాలు
◆ నేడు, రేపు మండలంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన
◆ స్వాగతం పలుకుతున్న సమస్యలు
◆ గ్రామస్తులు ప్రశ్నించకుండా బుజ్జగింపులు



అక్రమ అరెస్టులు..

చిలమత్తూరులో జరుగుతున్న పోరాటాలకు వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఇతర నాయకులు నాయకత్వం వహించారు. ఈ పరిస్థితుల్లో మంత్రి పర్యటిస్తున్న సందర్భంగా పేదలు ఇళ్ల స్థలాల కోసం ఆయన్ను నిలదీస్తే వైసిపి నేతల రియల్ ఎస్టేట్ బాగోతాలు బయటకు వస్తాయని భావించిన అధికార పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధి పథకం ప్రకారం వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌ను అక్రమ కేసులో అరెస్టు చేయించి, రిమాండ్‌కు తరలించారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.



మధురేపల్లి రోడ్డు వేయాలని సిపిఎం ఆధ్వర్యంలో వరినాట్లు వేస్తున్న గ్రామస్తులు (ఫైల్ ఫోటో)

పార్టీలోనూ ఐకమత్యం కరువు..

మండల వైసిపిలోనూ గ్రూపు విభేదాలు తారాస్థాయికి చేరాయి. హిందూపురం నియోజకవర్గంలో మంత్రి పర్యటిస్తుండగానే చిలమత్తూరు జడ్పీటీసీ, ఎంపిపి వర్గాలు ఒకరిపై ఒకరు బాహాబాహికి దిగారు. మూడు రోజుల క్రితం చోటు చేసుకున్న ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సమయంలో అందరూ కలిసి ఉన్నారనే సంకేతాలు ఆ పార్టీ క్యాడర్‌కు ఇచ్చేందుకు అసమ్మతి వర్గంలోని ఒకరికి మండల కన్వీనర్ పదవిని ఇచ్చారు. దీనిపై మరో వర్గం తీవ్ర స్థాయిలో అసంతప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కన్వీనర్‌గా మంత్రి ప్రకటించినా అధికారికంగా ఉత్తర్వులు అందని పరిస్థితి ఉంది. మంత్రి పర్యటన ముగిసిన తరువాత కన్వీనర్ పోస్టు వచ్చేదే లేదంటూ ప్రత్యర్థి వర్గీయులు బాహాటంగానే చెబుతున్నారు. ఓ వైపు సమస్యలు.. మరో వైపు పోరాటాలు.. పార్టీలో గ్రూపు రాజకీయాల నేపథ్యంలో మంత్రి సమన్వయం పేరుతో రెండు రోజులు పాటు మంత్రి నిర్వహించే కార్యక్రమాలు ఏ మేరకు జరుగుతాయన్నది వేచి చూడాల్సి ఉంది.



జగనన్నతోడు మెగా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న కలెక్టర్ తదితరులు

17,962 మందికి 'జగనన్న తోడు'

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో జగనన్న తోడు పథకం కింద 17,962 మందికి మంజూరు అయిందని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. గురువారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్లో జిల్లా స్థాయి జగనన్న తోడు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రి బోర్డ్ ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగా ఓబుళపతి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, డీఆర్డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరు వ్యాపారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం జగన్న తోడు ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తోందన్నారు. సున్నా వడ్డీ ద్వారా ఒక్కొక్క లబ్ధిదారునికి పదివేలు మంజూరు చేస్తోందన్నారు. 8వ విడతగా జిల్లాలో 17,962 మందికి ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. లబ్ధిదారులు జగనన్న తోడు పథకాన్ని సద్వినియోగం చేసుకొని అభివద్ధి చెందాలని కోరారు. అనంతరం కలెక్టర్, ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు మెగా చెక్కును అందించారు.

'పురం'లో వైసిపి విజయం ఖాయం : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-లేపాక్షి

హిందూపురం ఎమ్మెల్యే, ఎంపిలుగా వైసిపి అభ్యర్థుల విజయం సాధించడం ఖాయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆయన గురువారం మండల పరిధిలోని కోడిపల్లి, చోళ సముద్రం, బిసలమనేపల్లి, నాయనపల్లి, కల్లూరు, కొండూరు పంచాయతీల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పరిపాలన సాగిస్తున్న ఏకైక సిఎం జగన్ అన్నారు. పార్టీ శ్రేణులు సమిష్టిగా పని చేసి హిందూపురంలో వైసిపి జెండా ఎగురవేయాల న్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్, ఇన్‌ఛార్జి దీపిక, పార్లమెంట్ ఇన్‌ఛార్జి శాంతమ్మ, నాయకులు నారాయణస్వామి, ఎంపిపి వెంకటరత్నమ్మ, జడ్పిటిసి శ్రీనివాసులురెడ్డి, నాయకులు లేపాక్షి నారాయణస్వామి, బిసలమనేపల్లి వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచులు మంజునాథ్, నందిని, నాగేంద్ర వసుంధర పాల్గొన్నారు.

సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలి

వ్యకాసం ఆధ్వర్యంలో మంత్రి ఉషశ్రీచరణ్‌కు వినతి

ప్రజాశక్తి-రొద్దం

సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ గురువారం మంత్రి ఉషశ్రీచరణ్‌కు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం భూ సాధన కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కోగిర రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 669లో సాగులో ఉన్న పేదలకు అసైన్మెంట్ కోసం చర్యలు తీసుకోవాలని కమిటీ అధ్యక్షురాలు అనిత అధ్యక్షతన కోగిర గ్రామసభలో పాల్గొన్నా మంత్రికి వినతి పత్రం అందించామన్నారు. వ్య.కా.సం. జిల్లా కమిటీ సభ్యులు నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కోగిర, శ్యాపురం, కంబాలపల్లి, బొక్సంపల్లి, బీదానుపల్లి గ్రామాలకు చెందిన దళిత, గిరిజన, బలహీన వర్గాల భూమి లేని నిరుపేదలు(కందులు, జొన్నలు, కొర్రలు) పంటలు సాగు చేస్తున్నారని, వీటిని అసైన్మెంట్ చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి అధికారులతో సమాచారం తీసుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రామాంజనమ్మ, రమణమ్మ, చిన్న అంజనప్ప, లక్ష్మి, నాగమణి, అశోక్, 50 మంది బాధితులు పాల్గొన్నారు.



మంత్రికి ఉషశ్రీచరణ్‌కు వినతి పత్రం ఇస్తున్న వ్య.కా.సం. నాయకులు

పేదల నడ్డివిరిచిన ప్రభుత్వం : బికె

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్ర భవిష్యత్తు, మన భవిష్యత్తు, మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే బాబు రావాలి సైకో పోవాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథి పేర్కొన్నారు. ఆయన గురువారం మండల పరిధి లోని ఆర్.మరువపల్లిలో తన నివాసంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడు తూ వైసిపి ప్రభుత్వం రద్దుల ప్రభుత్వం, ఒక్క మాటలో చెప్పాలంటే పేదల నడ్డివిరిచే ప్రభుత్వ మని మండిపడ్డారు. గ్రామాల్లో వీధి దీపాలు వేయలేని, 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన చెత్త ప్రభుత్వమిది అని ధ్వజమెత్తారు. అధికారంలోకి రాగానే మద్యపాన నిషేధం చేసి, 2024 ఎన్నికల్లో ఓట్లు అడిగేం దుకు వస్తానని చెప్పిన జగన్ మాట తప్పాడన్నారు. అనేక రకాల నాసిరకం మద్యం తీసు కొచ్చి పేదల ప్రాణాలను బలి తీసుకుంటున్నార న్నారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ తీసుకొచ్చి ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పిస్తానని హామీ ఇచ్చి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా యువతను మోసం చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే చంద్రబాబు పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. నిరుద్యోగులకు రూ. 3 వేలు భృతి ఇస్తామన్నారు. జగన్‌కు మళ్లీ ఓటేస్తే రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేస్తాడన్నారు. టిడిపి గెలిస్తే మళ్లీ బిసిల రాజ్యం వస్తుందని తెలిపారు. వైసిపి తీసుకొచ్చింది భూరక్షణ కాదు.. భూ భక్షణ పథకం అంటూ మండిపడ్డాడు. రాబోయేది టిడిపి, జనసేన ప్రభుత్వమే అన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, సర్పంచి నాగరాజు, రంగప్ప, నాగప్ప, హరీష్, బుడ్డన్న, నరేష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బికె పార్థసారథి

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-రొద్దం

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యమని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఆమె గురువారం మండల పరిధిలోని షాపురం, కంబాలపల్లి, బీదానిపల్లి, కంచసముద్రం, కోగిర, తురకలాపట్నం, ఎల్‌జిబి నగర్, బొక్కసంపల్లి, తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. కోగిర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడు తూ విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ వైసిపి గెలుపునకు కష్టపడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి చంద్రశేఖర్, నాయకులు పొగాకు రామచంద్ర, బి.నారాయణ రెడ్డి, కలిపి శ్రీనివాసులు, తిమ్మయ్య, అక్కులప్ప, సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

వైసిపి పాలనలో అన్ని వర్గాలకు న్యాయం

గోరంట్ల రూరల్ : అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వానవోలు గ్రామపంచాయతీకి చెందిన కొలింపల్లి, గుంటు పల్లి, వానవోలు తండాల్లో గురువారం ఆయన పర్యటించారు. ముందుగా స్థానిక నాయకులు ఆయనకు శాలువా, పూలమాలలు వేసి బాణసంచా పేల్చి ఘనంగా స్వాగతం పలికారు. వానవోలులో శ్రీరంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీరాములు, ఉప సర్పంచి బుల్లెట్ బాబు, నాయకులు రాజేంద్రనాథ్‌స్వామి, వైస్ ఎంపిపి నాగభూషణ్‌రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, నార్సింపల్లి శివారెడ్డి, సరోజానాగేనాయక్, రాజారెడ్డి, గంపల రమణారెడ్డి, కాంగారెడ్డిపల్లి గోవిందరెడ్డి, విజయసింహారెడ్డి, పాటూరి లక్ష్మీరెడ్డి, నాగరాజు, సాయిసూర్య, జయ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తిప్పేస్వామికి మళ్లీ టికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి-మడకశిర

ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కషి చేస్తూ ప్రజలు మన్నలు పొందిన ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికూ 2024లో కూడా టికెట్ కేటాయించా లని వైసిపి ప్రజాప్రతి నిధులు, నాయకులు పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బి విశ్రాంతి భవనంలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ నాయకత్వంలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాన న్నారు. మడకశిర మండలంలోని చెరువులను కృష్ణా జలాలతో నింపి వందలాది ఎకరాల ఆయకట్టును సాగులోకి తీసుకొచ్చామన్నారు. ఏ గ్రామంలో వెళ్లినా ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపు తూ అండగా నిలుస్తున్నారన్నారు. ఈ తరుణంలో అధిష్టానం మరోసారి తిప్పేస్వామికే ఎమ్మెల్యే టికెట్ కేటాయించా లని నాయకులు కోరారు. సమావేశంలో రొళ్ల జడ్పిటిసి అనంతరాజు, పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప, మండల కన్వీనర్ రామిరెడ్డి, కౌన్సిలర్ సుభద్రనాగేంద్ర, ఒక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజుగౌడ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

బిసిల పార్టీ టిడిపి : సవితమ్మ

ప్రజాశక్తి-పెనుకొండ

బిసిల పునాదుల మీద పుట్టిన పార్టీ టిడిపి అని రాష్ట్ర కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిసిల గురించి మాట్లాడే అర్హత వైసిపికి లేదన్నారు. బిసి యువత భవిష్యత్తును నిర్వీర్యం చేసిన ఘనుడు సిఎం జగన్ అన్నారు. నా బిసి, నా ఎస్సి, నా ఎస్టీ, నా మైనారిటీ లాంటి మోసపూరిత మాటలు తప్ప వారికీ చేసింది శూన్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిసిల ద్రోహి జగన్‌కు బుద్ధి చెబుదాం

ప్రజాశక్తి-మడకశిర

బిసిలంతా ఏకమై వచ్చే ఎన్నికల్లో సిఎం జగన్‌కి గట్టిగా బుద్ధి చెబుదామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని బాలాజీ నగర్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిసిల ద్రోహి జగన్ అన్నారు. ఎన్టీఆర్ ప్రప్రథమంగా బిసిలకు రిజర్వేషన్లు తీసుకురాగా ఆ తర్వాత రిజర్వేషన్లను పెంచి పదవులు ఇచ్చిన, కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలు ఇచ్చిన ఘనత చంద్రబాబుదని తెలిపారు. వైసిపి ప్రభుత్వం బిసి కార్పొరేషన్లకు ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, భక్తర్, మనోహర్, లక్ష్మీనారాయణ, మంజునాథ్, రవీంద్రరెడ్డి, రామంజనేయులు, తిమ్మప్ప పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

వైసిపిలో సామాజిక న్యాయం శూన్యం : నిమ్మల

ప్రజాశక్తి-గోరంట్ల

వైసిపిలో బిసిలకు సామాజిక న్యాయం ఎక్కడా జరగలేదని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప విమర్శించారు. ఆయన గురువారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ సిఎం జగన్ బిసిలకు రాజకీయంగా, సామాజికంగా న్యాయం చేశామని గొప్పలు చెప్పుకుంటున్నాడే తప్ప ఎక్కడా సామాజిక న్యాయం చేయలేదన్నారు. రాష్ట్రంలో 56 బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేశారే కానీ నిధులు ఇవ్వలేదన్నారు. అక్రమంగా దోచుకున్న ఎంపి, ఎమ్మెల్యేలకు వైసిపిలో బదిలీలు, ప్రమో షన్లు ఇచ్చారని ఎద్దేవా చేశారు. వైసిపిలో మొత్తం రెడ్డి సామాజిక వర్గం వారే పెత్తనం చెలాయిస్తున్నా రన్నారు. టిడిపి ప్రభుత్వంలో బిసిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రాజకీయంగా, సామాజికంగా చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు.

చోరీలను నివారించండి

మడకశిర : మండల పరిధిలోని పిఎస్ తండా, గుండుమల, తదితర గ్రామాల్లో ప్రభుత్వ, రైతులకు సంబంధించిన 14 బోర్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లినట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. రాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ వైర్లను దొంగిలిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. పేట్రేగిపోతున్న దొంగల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

టిడిపితోనే ఎపికి బంగారు భవిష్యత్తు

మడకశిర : 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా గురువారం టిడిపి నాయకులు పట్టణంలోని 7వ వార్డులో పర్యటించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మనోహర్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు తిమ్మరాజు, నాయకులు రవికుమార్, చంద్రశేఖర్, స్వామి, ఓంప్రకాష్ గంగాధర్, పాల్గొన్నారు.

సన్మానం : 2024 ఎన్నికల నేపథ్యంలో టిడిపి ప్రకటించిన 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని మండల పరిధిలోని వైబి హళ్లి పంచాయతీలో వంద శాతం పూర్తి చేసిన సందర్భంగా గురువారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో యూనిట్ ఇన్‌ఛార్జి ప్రసాద్, బూత్ ఇన్‌ఛార్జులు కుమార్, మూర్తి, లక్ష్మినారాయణ, శ్రీనాథ్‌రెడ్డి, సత్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మినారాయణ, పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

కొత్తచెరువు : ఖరీఫ్‌లో పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం, పంటల బీమా అందించి ఆదుకోవాలని మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ పంచాయతీల పరిధిలో ఉన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బారాన్ సాహెబ్ ,ఏవో నటరాజుతో పాటు ఆయా శాఖ అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయకర్తకు ఘనస్వాగతం

నంబులపూలకుంట : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్‌బాషాకు నంబులపూలకుంటకు చెందిన వైసిపి నాయకులు గురువారం ఘనస్వాగతం పలికారు. వైసిపి యువనాయకులు బాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వచ్చి మక్బూల్‌బాషాకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూల శ్రీనివాసరెడ్డి, షామీర్, కేశవరెడ్డి, అనిల్ కుమార్ నాయుడు, జగదీశ్వర్ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె



ధర్మవరంలో సమ్మెలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లాకార్యదర్శి ఇంతియాజ్



ముదిగుబ్బలో నిర్వహించిన సమ్మెలో నాయకులు, అంగన్వాడీలు



కదిరిలో సమ్మెకు జనసేన మద్దతు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మె ఆగదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీదేవి హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయంఎదుట 31వ రోజు తమ సమ్మెను అంగన్వాడీలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ 31 రోజులుగా అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించకపోగా వారిపై కక్షసాధింపు చర్యలకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేవారు. ఇలాంటి బెదిరింపులకు బయపడేప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్ ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, అధికసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలో అంగన్వాడీలు 31 రోజు సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మండల యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, భారతి, సుజాతతో పాటు అధికసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని అంగన్వాడీలు 31వ రోజు సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం రమేష్‌తో పాటు అధికసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

పరిగి : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు గురువారం వినూత్న రీతిలో నిరసన చేశారు. ఇందులో భాగంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మోకాళ్ళపై కూర్చొని నిరసన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల కనీస డిమాండ్లు పరిష్కరిస్తామని ముందుకు వచ్చిన పాపన పోలేదన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకురాలు పద్మతో పాటు అంగన్వాడీలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేదాకా సమ్మెను విరమించేది లేదని సిఐటియు జిల్లా నాయకులు శ్రీదేవి, జిల్లా శ్రామిక మహిళ అధ్యక్షురాలు దిల్షాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్పందించి వెంటనే అంగన్వాడీల న్యాయమైన కోరికలను తీర్చాలని లేకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ప్రాజెక్టు కార్యదర్శి చంద్రకళ, హిందూపురం ప్రాజెక్టు అధ్యక్షురాలు శోభ, బత్తలపల్లి ప్రాజెక్టు లీడర్లు వాసంతి, లీడర్స్ రంజిత, వసంతం జయసుధ, పుష్పలత, శివమ్మ ,సుగుణ, క్రిష్టవేణి జయసుధ, సున్నీబేగం, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : అంగన్వాడీ సెంటర్లు మూసి ఉంటే సెంటర్లను తెరిచామని చెప్పడం సబబు కాదుఉద్యమాన్ని నీరుగార్చ ప్రయత్నాలు మానుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, అంగన్వాడి యూనియన్ నాయకు రాళ్లు రంగమ్మ ఆశీర్వాదమ్మ అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 31 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నామన్నారు. అయితే మండల పరిధిలోని బాబాసాహెబ్ పల్లి లో ఉన్న అంగన్వాడీ సెంటర్ ను తెరిచామని, అంగన్వాడీలు విధులకు హాజరు అయ్యారని అపద్దాలు చెబుతూ తమ ఉద్యమాన్ని నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం పోరాటం ఆపే ప్రసక్తి లేదన్నారు.

ముదిగుబ్బ : తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. ఈసందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీలకు నోటీసులు ఇస్తామని బెదిరించడాన్ని ఖండిస్తునానమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు నాయకులు మధు, వెంకటేశు, బాబు, పోతలయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు రజియాతో పాటు పెద్దసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు అంగన్వాడీల సమ్మె 31వ రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 31వ రోజు ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, అంగన్వాడీలతో పాటు సిఐటియు నాయకులు బాళ్ల అంజి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరవధిక సమ్మెను కొనసాగించారు. జనసేన పార్టీ తరపున కదిరి ఇన్‌చార్జి భైరవ ప్రసాద్, బ్లూమూన్ శివశంకర్ అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్లను అమలు చేయని ప్రభుత్వం వారిని రోడ్డుమీదకి లాగిందన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, నల్లచెరువు మండల కన్వీనర్ రవికుమార్, చిన్నపరెడ్డి, కిన్నెర మహేష్, హరిబాబు, ప్రతాప్, రాజ్ కుమార్, గంగరాజు, రామ్మోహన్, నాగరాజు, రామచంద్ర, రఘు, ఐనొద్దిన్, రవి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురువారం నాటికి 31వ రోజు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించినా, విధుల నుంచి తొలగిస్తామని షోకాజ్ నోటీసులు జారీ చేసిన తమ ఆందోళనను కొనసాగిస్తామని అన్నారు. సమ్మెలో భాగంగా 31 వ సంఖ్య ఆకారంలో అంగన్వాడీలంతా కూర్చొని వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. అనంతరం సమ్మె శిబిరంలో ముఖ్యమంత్రి జగన్ చిత్ర పటం ముందు సెల్‌ఫోన్‌లు, ఏకరూప చీరలను పెట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, యూనియన్ నాయకులు శైలజ, శిరీషా, నాగమ్మ, సాహేరా, వరలక్ష్మితో పాటు పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు మట్టి తింటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ప్రతిపక్షనేత హోదాలో జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాట తప్పారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే రోజూ ఇలానే మట్టి తింటూ నిరసన తెలుపుతామన్నారు. మంత్రి ఉషశ్రీచరణ్ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారని, మా ఇంటికి ప్రచారానికి వస్తే ఆమెకు చీర, పసుపు, కుంకుమ ఇచ్చి తరిమి కొడతామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ సిబ్బంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. నెల రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహప్ప, భాగ్యమ్మ, రూప, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

ప్రజాశక్తి కదిరి టౌన్



పార్టీలోకి చేరిన వారితో కందికుంట

కదిరి నియోజకవర్గంలోని పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలోకి చేరారు. తలుపుల మండలం పులిగుండ్లపల్లి పంచాయతీ, ఉడుమల కుర్తి పంచాయతీ సోమలవాండ్ల పల్లి గ్రామాలకు చెందిన 25 కుటుంబాలు వైసిపిని వీడి టీడీపీలోకి చేరాయి. ఈ మేరకు వారు గురువారం పట్టణంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో పార్టీలో చేరారు. కందికుంట వారికి పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం అరాచకాలు సృష్టిస్తోందని విమర్శించారు. మార్కండేయ,వీర కొండయ్య, పాపయ్య, పూజ, పులిగొండ్లపల్లి కి చెందిన వెంకటేశు, కృష్ణ ,జీవన్, వెంకటరమణ, రామచంద్ర, రాజగోపాల్, గంగిశెట్టి, సుబ్బయ్య, రమణ, రామసుబ్బమ్మ, పద్మావతి, నారాయణమ్మ, విశ్వనాథ్ రెడ్డి తదితరులు టిడిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో తలుపుల మండల నాయకులు మేడ శంకర్, కన్వీనర్ ముబారక్‌తో పాటు నాయకులు రాజారెడ్డి, రమణ,బాబజాన్, షేక్ బాషా,వెంకటేశు, జయచంద్ర, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో వైసిపి జెండా ఎగురవేస్తాం

ప్రజాశక్తి-హిందూపురం



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌నిశ్చల్

హిందూపురంలో ఈ సారి జరిగే ఎన్నికల్లో వైసిపి జెండా ఎగురవేస్తామని రాష్ట్ర అగ్రో సంస్థ ఛైర్మన్ నవీన్‌నిశ్చల్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం హిందూపురం అసెంబ్లీ నియోజక పరిధిలోని లేపాక్షి మండలం చోళ సముద్రం, బిసన మానేపల్లి పంచాయతీల పరిధిలో నిర్వహించిన సమావేశాల్లో మంత్రి పెద్దిరెడ్డితో పాటు నవీన్ నిశ్చల్ పాల్గొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూడు రోజులుగా స్థానికంగా పర్యటిస్తున్నప్పటికీ నవీన్ దూరంగా ఉండడం పై పార్టీలో జోరుగా చర్చ సాగింది. ఈ నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డితో సహా ఆయా పంచాయతీల్లో నవీన్ నిశ్చల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ వైసిపిలోకి తనను ఆహ్వానించింది, 2014లో టికెట్ ఇప్పించింది రాష్ట్ర ఆగ్రో సంస్థ ఛైర్మన్ పదవి రావటానికి కారణం అయింది మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న టిఎన్ దీపికను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శాంతమ్మను గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

వివాహిత కిడ్నాప్‌నకు యత్నం

ఏడుగురిపై కేసు

కదిరి అర్బన్ : పట్టణ పరిధిలోని జోకుపాల్యం వీధిలో నివాసం ఉండే బీబీజాన్ అనే మహిళను ఆమె బంధువులు కిడ్నాప్ చేశారు. బాధితులు తెలిపిన వివరాలు... గురువారం ఉదయం 10.00 గంటలకు ఆమె బంధువులైన పట్టణానికి చెందిన చాంద్‌బాషా, ఆయన భార్య, కుమారుడు, ముత్యాలచెరువుకు చెందిన అల్లాబక్ష్, ఆయన భార్య, కుమారుడు, మరికొందరు కలసి బీబీజాన్ ఇంట్లోకి వెళ్లి కొట్టి దౌర్జన్యం చేసి ఆటోలో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. ఇరుగు పొరుగు వారు వారించిన వినలేదు. దీంతో వారు పోలీసులకు సమాచారమందించారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి బీబీజాన్‌ను విడిపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి ఎతలిపారు. బీబీజాన్‌కు సంబంధించిన ఆస్తులకు సంబందించి ఆమెకు, ఆమె బంధువులకు మధ్య వివాదం నడుస్తోంది. ఈ కేసు న్యాయస్థానంలో విచారణ ఉంది. ఇటీవల బీబీజాన్‌ను ఆమె బంధువులు బెదిరించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించగా వారు బంధువులను పిలిపించి కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. అయినా గురువారం తిరిగి బీబీజాన్‌పై దాడికి యత్నించి కిడ్నాప్‌ప్రయత్నం చేశారు.

మద్యం అక్రమ రవాణాపై కొనసాగుతున్న దాడులు

పుట్టపర్తి రూరల్: మద్యం అక్రమ రవాణా, నాటుసారా తయారీపై సెబ్ అధికారులు దాడులు కొనసాగిస్తున్నారు. ధర్మవరం స్టేషన్ పరిధిలోని ముదిగుబ్బ మండలం 110 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సికె పల్లి సెబ్ స్టేషన్ పరిధిలో ఒక ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి 25 కర్నాటక మద్యం పాకెట్లు స్వాధీనపరుచుకున్నారు. పెనుకొండ సెబ్ స్టేషన్ పరిధి లో ఒక ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి 40 కర్నాటక మద్యం పాకెట్లు స్వాధీనపరుచుకున్నారు. హిందూపురం సెబ్ స్టేషన్ పరిధిలో రెండు ఎన్‌డిపిఎల్ కేసులు నమోదు చేసి 70 కర్నాటక మద్యం పాకెట్లు, 2 ద్విచక్రవాహనాలు స్వాధీనపరుచుకున్నారు. పుట్టపర్తి సెబ్ స్టేషన్ పరిధిలో ఒక ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి 25 కర్నాటక మద్యం పాకెట్లు, తనకల్ సెబ్ స్టేషన్ పరిధిలో రెండు ఎన్‌డిపిఎల్ కేసులు నమోదు చేసి 66 కర్నాటక మద్యం పాకెట్లు స్వాధీనపరుచుకున్నారు.

పేకాట ఆడితే చర్యలు

ఓబుళదేవరచెరువు : సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా కోడి పందేలు, పేకాట ఆడితే చర్యలు తప్పవని ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని వీరవోబనపల్లి, నల్లగుట్లపల్లి గ్రామాల్లో పోలీసులు ప్రజలతో సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గ్రంథాలయం తనిఖీ

కదిరి టౌన్ : స్థానిక గ్రంథాలయాన్ని అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ గురువారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పలు రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణకిషోర్‌రెడ్డి, సిబ్బంది చాంద్‌బాషా, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

నల్లచెరువు : మండల పరిధిలోని జోగన్నపేట గ్రామంలో మండల వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో కంది పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. పూలకుంటపల్లిలో రైతు ఆదినారాయణకు చెందిన కందిపంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతి, ఎంపిఇఒఉదయకుమార్, పూలకుంట పల్లి గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కళాభిషేకం

ధర్మవరం టౌన్ : సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడంలో భాగంగా గత కొంతకాలంగా తేనె తెలుగు కల్చరల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కళాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని శిరిడి సాయి బాబా గుడి సమీపంలో తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 131వ కళాభిషేకం కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో సీనియర్ రంగస్థల నటులైన అప్రాచెరువు వీరనారాయణప్ప, వీధినాటకాల కళాకారుడు గంటాపురం జాలాప్ప తదితరులు నాటి అనుభవాలు , నేడు నాటకరంగం పరిస్థితులను చర్చించి , సంగీత దర్శకులు ఎ.వి. రమణగారి సంగీతంలో వివరించారు. వారిచేత పద్యాలాపన చేయించి ప్రశంసా పత్రం,మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అంజనప్ప, కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికం సాయి, కన్వీనర్ బిటెక్ చందు, చలపతిరావు, శ్రీరాములు, నబీ రసూల్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కదిరి టౌన్ : పట్టణంలోని శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 41 రోజులకు గాను నగదుగా రూ.65,74,179లు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ జెరిపిటి గోపాలక్రిష్ణ, ఆలయ కార్యనిర్వాణాధికారి వెండిదండి శ్రీనివాస రెడ్డి, హుండీ పర్యవేక్షణాధికారి నరసింహరాజు, తనిఖీ అధికారి, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హిందూపురం డివిజన్, పాలకమండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది, కెనరా బ్యాంకు కదిరి మేనేజర్ మధుసుధన్, కెనరా బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా వైసిపి పాలన : కందికుంట



విలేకరులతో మాట్లాడుతున్న కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలో వైసిపి పాలన కుక్కలు చింపిన విస్తరులా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన రోజు నుంచి అరాచక పాలన సాగుతోందని విమర్శించారు. తద్వారా వ్యవస్థలు అన్ని దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. అడుగడుగునా అవినీతి, దౌర్జన్యాలు, అక్రమ సంపాదనలే కనిపిస్తున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ సైకో పాలనతో విసిగిపోయారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన భూముల రికార్డులు తారుమారు చేసి వాటిని అమ్ముకునేందుకు వైకాపా ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. జగన్ రెడ్డి ప్రభుత్వ అవినీతి, అన్యాయాలపై ప్రశ్నల వర్షం కురిపిస్తుంటే తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు మొదలైందన్నారు.

ఓటు హక్కు వినియోగంపై చైతన్యం తేవాలి

కలెక్టర్ అరుణ్ బాబు


ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఓటరు జాబితాలో పేరున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా వారిలో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ రంగంలో వస్తున్న మార్పులను స్వీకరించి తదనుగుణంగా ఎన్నికల ప్రక్రియలో మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అవగాహన ఉండాలని అందుకు ఈ శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని అన్నారు. ఈవీఎంలు, వివి ప్యాడ్ యంత్రాలపై ఓటర్లలో విశ్వాసం కలిగించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. నియోజకవర్గానికి 10 మంది మాస్టర్ ట్రైనర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, రమేష్ రెడ్డి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

అలరించిన సత్యసాయి విద్యార్థుల విన్యాసాలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పట్టణంలోని సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు నిర్వహించిన ఆటల విన్యాసాలు ఆహుతులను అలరించాయి. స్టేడియంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్, ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, నాగానంద్, డాక్టర్ మోహన్ గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి వీటిని ప్రారంభించారు. పుట్టపర్తి, అనంతపురం, బృందావన్ కళాశాలకు చెందిన సత్యసాయి విద్యార్థులు నిర్వహించిన ఆటల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఏటా జనవరి 11న ఈ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఒళ్లు గగ్గుర పొడిచే మోటార్ సైకిల్ విన్యాసాలు, సింహనాట్యం, మహాభారతం, రామాయణం ఘట్టాలు, జిమ్నాస్టిక్స్, కర్రసాము, సైకిల్ చేజింగ్, తాడుపై విన్యాసాలు, కరాటే, బంగిజంప్, పంజాబ్ నృత్యం, కత్తిసాము తదితర ఆటల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఉదయం 9 నుండి 11 గంటల వరకు కళాశాల విద్యార్థులు పాల్గొనగా, సాయంత్రం విద్యార్థిని విద్యార్థుల, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఇతర అధికారులు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రేక్షకులు పాల్గొన్నారు.







సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థుల విన్యాసాలు